క్లుప్తంగా

కేవీ ఉద్యోగికి అరుదైన గౌరవం



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాల సీనియర్ స్టాఫ్ మెంబర్, త్వరలో ఉద్యోగ విరమణ పొందనున్న ఎలిషాల వెంకటేశానికి అరుదైన గౌరవం కల్పించారు. 76వ గణతంత్ర దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించే అరుదైన అవకాశాన్ని ఆయనకు కల్పించారు. కేవీలో 37 ఏళ్లపాటు సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తూ వచ్చే ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేయబోతున్న సందర్భంగా వెంకటేశం దంపతులను కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి, సిబ్బంది, తదితరులు ఆదివారం సన్మానించారు.

బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయండి



హన్మకొండ చౌరస్తా: వచ్చే నెల 2వ తేదీన సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న బీసీల రాజకీయ యుద్ధభేరి మహాసభకు ముస్లిం మైనారిటీలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని జమాతే ఇస్లామీ హింద్ ట్రైసిటీ అధ్యక్షుడు అబ్దుల్ హనన్ పిలుపునిచ్చారు. హనుమకొండ రాయపురలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జమాతే ఇస్లామీ హింద్ ట్రైసిటీ బాధ్యుల సమావేశం ఆదివారం జరిగింది. అబ్దుల్ మజీద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అబ్దుల్ హనన్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలు, బీసీలకు సాంఘిక, రాజకీయ న్యాయం దక్కాలంటే బీసీలకు రాజ్యాధికారం రావాలని అన్నారు. సమావేశంలో ముజాహిద్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

వివేచన న్యూస్‌లెటర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రూపొందించిన వివేచన న్యూస్‌లెటర్ వాల్యూం 20, ఇష్యూ 1ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డితో కలిసి కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎడిటోరియల్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి, సభ్యులు డాక్టర్ భారవీశర్మ, డాక్టర్ రాధికారాణి, డాక్టర్ దీపాజ్యోతి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో ఆదివారం మంత్రి పర్యటనను పురస్కరించుకుని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులను హసన్‌పర్తి పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్.. పోలీస్‌స్టేషన్ వెళ్లి వారితో మాట్లాడారు.

ట్రాలీ ఆటో బ్యాటరీ, నగదు చోరీ

హసన్‌పర్తి: ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ట్రాలీ ఆటో బ్యాటరీ, ఎయిర్ జాక్‌తో పాటు నగదును ఎత్తుకెళ్లారని బాధితుడు వాపోయాడు. ఈమేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. హసన్‌పర్తికి చెందిన జన్ను కిషన్ శనివారం రాత్రి తన ట్రాలీ ఆటోను ఇంటి ముందు పార్క్ చేశాడు. ఆదివారం చూసేసరికి ట్రాలీ ఆటోకు బ్యాటరీ, ఎయిర్ జాక్ లేనట్లు గుర్తించాడు. అలాగే, ట్రాలీ ఆటోలో ఉన్న రూ.12.500 నగదు కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేదలకు సేవ అభినందనీయం



ఖిలా వరంగల్: ఎస్ఎస్‌కే సమాజ్ స్థాపించి పేదలకు సేవ చేయడం అభినందనీయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి విశ్వనాథ రవీందర్ ఆధ్వర్యంలో డాక్టర్ దీపక్ శోధన్ అధ్యక్షతన ఎస్ఎస్‌కే సమాజ్ వరంగల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను వరంగల్ ఉర్సుగుట్ట నానిగార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి సురేఖ హాజరై సమాజ్ సేవ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఆమెను ఎస్ఎస్‌కే ప్రతినిధులు సన్మానించారు. డాక్టర్ అశోక్, కొనేరి రాజ్‌కుమార్, మామిడి రాంకిషన్, ధర్మరాజు, పాలక కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జెండాతో గుర్రంపై స్వారీ

హసన్‌పర్తి: జాతీయ జెండా చేత బూనీ గుర్రపు స్వారీ చేస్తూ ఓ యువకుడు దేశభక్తి చాటుకున్నాడు. వరంగల్ నగరానికి చెందిన సారంగం కేయూ జంక్షన్‌లో ఫిట్నెస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేతిలో జాతీయ పతాకాన్ని పట్టుకుని.. గుర్రంపై వేగంగా పరుగులుదీస్తూ జై హింద్ అంటూ నినాదాలు చేశాడు. ఎస్సారెస్పీ కట్టపై సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వరకు జాతీయ జెండాతో గుర్రంపై స్వారీ చేస్తూ ప్రజలను ఆకట్టుకున్నాడు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

76వ గణతంత్ర దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, నగరంలోని అన్ని డివిజన్లలో జాతీయ జెండాలను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు అందరికి దక్కాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ



జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు, తదితరులు



ఓసిటీ క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండా సురేఖ, నాయకులు



కాంగ్రెస్ భవన్‌లో జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి



హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు



హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, నాయకులు



ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి, శాస్త్రవేత్తలు, ఉద్యోగులు



జెండాకు గౌరవ వందనం చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా



బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో..



వరంగల్ అర్బన్ బ్యాంక్ వద్ద చైర్మన్ ప్రదీప్‌రావు, ఉద్యోగులు, తదితరులు



వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్డులో మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు..



భద్రకాళి దేవాలయంలో జాతీయజెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న ఈఓ శేషుభారతి, తదితరులు



యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జెండాకు వందనం చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, తదితరులు



టీజీటీఎస్‌పీ బెటాలియన్‌లో..



కాజీపేట రూరల్: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ చింత మురళి



పీటీసీలో జెండాకు సెల్యూట్ చేస్తున్న ఇంజారపు పూజ, సిబ్బంది



కాజీపేట వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై..



మడికొండలో జెండాను ఆవిష్కరించిన అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్



హనుమకొండ టీవీ టవర్ కాలనీలో..



గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో..



వడ్డేపల్లిలో జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు



వరంగల్ గిర్మాజీపేట బండెల్లిశెట్టి వీధిలో..



హనుమకొండ కొత్తూరుజెండాలోని ఇంటెగ్రల్ స్కూల్‌లో..



49వ డివిజన్‌లో కార్పొరేటర్ ఏనుగుల మానసరాంప్రసాద్..

కేంద్ర రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

హన్మకొండ చౌరస్తా: రైతు వ్యతిరేక సంస్కరణలు తీసుకొస్తూ, దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే కుట్రలకు పాల్పడుతున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలను దేశ రైతాంగం ఐక్యంగా ప్రతిఘటించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం వరంగల్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి సూచించారు. సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా హనుమకొండ బస్టాండ్ సెంటర్‌లో ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతు కేంద్రం కుట్రపూరితంగా వ్యవసాయ మార్కెట్ జాతీయ విధాన ముసాయిదాను విడుదల చేసిందని అన్నారు. ఇది దేశ వ్యవసాయ రంగానికి చాలా ప్రమాదకరమని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు మైదం పాణి, అర్శం అశోక్, నరసింహారావు, రామచంద్రు, లక్ష్మక్క, సుగుణ, యాకలక్ష్మి, ఎల్లమ్మ, కుమారస్వామి, సతీష్, సుధాకర్, ఐలయ్య పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించేందుకు సహకరించాలి



చిన్నారులతో గోపాల్, రైల్వే కమిటీ సభ్యులు

కాజీపేట రూరల్: పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా వారికి నచ్చిన రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సికింద్రాబాద్ డివిజన్ అడిషనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్‌ఎం) ఎం.గోపాల్ సూచించారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో శనివారం రాత్రి వరకు జరిగిన క్విజ్, చిత్రలేఖనం, కల్చరల్ ఈవెంట్స్, పాటల పోటీల్లో గెలిచిన చిన్నారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ప్రశాంత కృష్ణసాయి, వైస్ చైర్మన్ ఎస్‌వీ.వెంకటకుమార్, రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, బీసీ అసోసియేషన్ డివిజన్ ప్రెసిడెంట్ ఆర్.రమేష్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి జి.రాజేశ్వర్‌రావు, కల్చరల్ ఇన్‌చార్జ్ ధరావత్ రఘు, క్రికెట్ క్రీడల ఇన్‌చార్జ్ పి.ప్రశాంత్, సభ్యులు ఎస్.ప్రవీణ్, సుంచు ప్రశాంత్, ఇన్‌స్టిట్యూట్ మేనేజర్ అమర్‌నాథ్, హరి, నాగరాజు, సమద్‌పాషా, అనిల్, సదానందం, మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వరంగల్: పీసీసీ ఆదేశానుసారం కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య వరంగల్ పోచమ్మమైదాన్‌లో ఆదివారం సంబురాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు ప్రారంభించిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బస్వరాజు శిరీష శ్రీమాన్, మాజీ కార్పొరేటర్లు తత్తెర లక్ష్మణ్, జన్ను అరుణ్, దామెర సర్వేశం, దూపం సంపత్, బిల్లా కవిత శ్రీకాంత్, జన్ను రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంట్ల రాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్, నాయకులు ఎండీ తాహీర్, ఎండీ జహీర్, ఎండీ ఇంతియాజ్, ఎండీ ఇమ్రాన్, ఎండీ మస్తాన్, కరాటే ప్రభాకర్, బైరబోయిన చంద్రమౌళి, తోట బాలరాజు, మార్త ఆంజనేయులు, చిరంజీవి, బాబు, కోదాటి అనిల్, చాగంటి శ్రీనివాస్, అందే సునీల్, సందెల దామోదర్, రామ యాదగిరి, వెల్దండి లక్ష్మణ్, 300 మంది పాల్గొన్నారు.

మిర్చి సాగుపై సీడీ ఆవిష్కరణ

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సౌజన్యంతో తెలంగాణ సమాచార శాఖ, సాంస్కృతికశాఖ కళాకారులు మిర్చి పంట సాగు పద్ధతులపై పాటల సీడీని రూపొందించారు. గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ సత్య శారద పాటల సీడీని ఆవిష్కరించారు. చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కంభంపాటి కుమారస్వామి, తుమికి రమేశ్‌బాబు, కటకం పెంటయ్య, చాంబర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ పితామహుడు బీవీ.రావు



కాజీపేట అర్బన్: కోళ్ల పరిశ్రమ స్థాపనకు నాంది పలికిన పౌల్ట్రీరంగ పితామహుడు బీవీ.రావు అని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు మార్నేని ధర్మారావు కొనియాడారు. హంటర్‌రోడ్డులోని బీవీ.రావు భవన్‌లో తొలుత గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించి, బీవీ.రావు 29వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రదీప్‌రావు, ధర్మారావు మాట్లాడుతూ కోళ్ల రైతులు నష్టాల ఊబి నుంచి బయట పడాలంటే జాతీయ స్థాయిలో నెక్ బోర్డు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నెక్ వరంగల్ లోకల్ జోనల్ కమిటీ సభ్యులు శ్యాంసుందర్ రావు, రమణారెడ్డి, రామ్‌ప్రసాద్, రామ్‌చందర్ రావు, కే.రాజేశ్వర్‌రావు, యుగంధర్, దేవేందర్‌రెడ్డి, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ ప్రకటనపై హర్షం

కాజీపేట అర్బన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు న్యూశాయంపేటలో ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మంద ఇద్దయ్య, బొట్ల భిక్షపతి, మందకుమార్ మాదిగ, సుకుమార్ పాల్గొన్నారు.

హన్మకొండ: అంటరాని జాతికి ఆత్మగౌరవం నేర్పిన నాయకుడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మ శ్రీ అవార్డు ప్రకటించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ అన్నారు.

కేయూను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

- వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్దామని వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డిఅన్నారు. ఆదివారం క్యాంపస్‌లోని పరిపాలన భవనం వద్ద గణ తంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వీసీ ప్రతాప్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షాభియాన్ ద్వారా వివిధ పరిశోధన కేంద్రాలను ఏర్పాటుచేసి పరిశోధనలకు ప్రోత్సహిస్తామన్నారు. యూనివర్సిటీ గోల్డెన్‌జూబ్లీలోకి అడుగు పెట్టబోతోందన్నారు. అనంతరం నాలుగు వారాల పాటు కెపాసిటీ బిల్డింగ్‌పై శిక్షణ పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రోడ్‌స్టార్లు, దివ్యాంగులకోసం ర్యాంపులను ఏర్పాటుచేసిన ఉద్యోగులను సర్టిఫికెట్లతో అభినందించారు. తొలుత ఎన్‌సీసీ కెడెట్ల మార్చ్‌ఫాస్ట్‌చేశారు. కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ బి. రమ, డాక్టర్ ఎస్. సుదర్శన్, డాక్టర్ బి. సుకుమారి, ఎం బాలుచౌహాన్, కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ రాజయ్య పాల్గొన్నారు.

వినియోగదారులకు అత్యుత్తమ సేవలు



మాట్లాడుతున్న అశోక్ కుమార్

- హెచ్‌ఆర్‌డీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ అశోక్ కుమార్

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ (హెచ్‌ఆర్‌డీ) బి.అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకున్నారు. డైరెక్టర్ అశోక్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ అమరవీరుల స్తూపం వద్ద అమరులకు డైరెక్టర్లు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాలలో 68.39 లక్షల వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. ఉత్తమ సేవలకుగాను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అత్యుత్తమ సేవా గౌరవ పురస్కారం అందుకున్నారన్నారు. 13.47 లక్షల రైతులకు 24 గంటల మెరుగైన, నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. గృహ జ్యోతి పథకం ద్వారా 23.97 లక్షల మంది వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



బైక్ ర్యాలీలో పాల్గొన్న హోండా సంస్థ సిబ్బంది

వరంగల్: రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని నాగార్జున హోండా ఆధ్వర్యంలో ములుగు రోడ్డు నుంచి పోచమ్మమైదాన్ సర్కిల్ వరకు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ద్విచక్ర వాహనదారులతో ప్రమాణం చేయించి కరపత్రాలను ట్రాఫిక్ పోలీసులు పంపిణీ చేశారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ సిద్ధార్థ, దిలీప్ సిబ్బంది పాల్గొన్నారు.